## ఆదిపర్వ కథాంశాలు

శ్రీమహాభారతం స్థూలంగా 18పర్వాలు - మరోకోణంలో చూస్తే నూరుపర్వాలు. వీటిని ఉపపర్వాలు అనవచ్చు. ఆదృష్టితో చూస్తే ఆదిపర్వంలో 19 పందొమ్మిది ఉపపర్వాలున్నాయి. 9382 శ్లోకాలు వున్నాయి. విభాగసౌలభ్యం కోసం ఆ ఉపపర్వాల ఆధారంగా ఈ ఆదిపర్వకథ ఇచట పొందుపరుస్తున్నాము.

**1. అనుక్రమణికా పర్వము -** (1) 275 (ఉపపర్వం పేరు తరువాత బ్రాకెట్‌లో ఉన్న సంఖ్య ఆ ఉపపర్వంలోని అధ్యాయాలను, తరువాత సంఖ్య శ్లోకాలను సూచిస్తుంది.)

విశ్వశ్రేయస్సుకోసం కులపతి అయిన శౌనకుడు నైమిశారణ్యంలో ద్వాదశవార్షికయాగం చేస్తున్నాడు. అక్కడకు ఉగ్రశ్రవసుడనే పౌరాణికుడు వచ్చాడు. కుశలప్రశ్నాదిక మయినతరువాత అక్కడి మునులంతా ఆ పౌరాణికుని శ్రీమహాభారతం చెప్పమని అడిగారు. అతడు పరబ్రహ్మకు నమస్కరించి వ్యాసప్రోక్తమయిన శ్రీమహాభారతం చెప్పనారంభించాడు.

ఈ శ్రీమహాభారతాన్ని మనసులో నింపుకొని వ్యాసమహర్షి యోగశక్తితో సర్వమును వీక్షించాడు. అందులో ఆయనకు లోకవృత్తమంతా కనపడింది. సృష్టి అంతా సంక్షేపంగా గోచరించింది. వేదాలు, ధర్మార్థకామాలు, లోకయాత్రావిధానం అంతా దృష్టిగోచరమయింది. దాన్ని అంతా వ్యాసుడు సంక్షిప్తంగానూ విస్తారంగానూ చెప్పాడు. ఆవిధంగా చెప్పడం పండితులకూ ఇష్టం. తపస్సుతో వేదాలను వింగడించి(వ్యాసంచేసి) ఈ ఇతిహాసాన్ని వ్రాసాడు వ్యాసుడు. ఇది శిష్యులకు ఎలా చెప్పాలా?అని ఆలోచించాడు. అంతలో బ్రహ్మ(లోకహితంకోరి) ప్రత్యక్షమయినాడు. వ్యాసుడు నమస్కరించి విషయమంతా చెప్పాడు. ఈ భారతం అనే కావ్యంలో ఏ ఏ విశేషాలు సమకూర్చాడో చెప్పాడు. వెంటనే బ్రహ్మ నీయీ కావ్యం వ్రాయటానికి గణేశుని స్మరించు అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

వ్యాసుడు గణేశుని స్మరించాడు. గణేశుడు ప్రత్యక్షమయి "నా లేఖిని ఆగకుండా చెప్పాలి అని షరతు పెట్టాడు. అలాగే అని వ్యాసుడు "అర్థం

చేసుకొని వ్రాయి" అని అన్నాడు. సరే అన్నాడు విఘ్నేశ్వరుడు. అందుచేత వ్యాసుడు గూఢార్థాలు కల శ్లోకాలు మధ్యమధ్యలో చెప్పేవాడట. అవి అర్ధంచేసుకొని వ్రాసేవాడు గణేశుడు. అటువంటి
క్లిష్టశ్లోకాలు 8800 ఉన్నాయట.

ఈ ఉపపర్వాన్ని సంగ్రహాధ్యాయం అని అంటారు. వ్యాసుడు ఈ భారతానికి కర్త మాత్రమేకాదు- భారతవంశానికి రక్షణకర్తకూడ. తల్లి అయిన సత్యవతి నియోగంచేతనూ, గాంగేయుని ఇష్టంతోనూ విచిత్రవీర్యుని క్షేత్రాల్లో కృష్ణద్వైపాయనుడు ముగ్గురు పుత్రులను కన్నాడు. వారు ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు. తరువాత వ్యాసుడు తపస్సుకు వెళ్లిపోయాడు. వాళ్లు ముగ్గురూ పెద్దవాళ్లయి చనిపోయాక ఈ మనుష్య లోకంలో వ్యాసుడు శ్రీమహాభారతం చెప్పాడు. జనమేజయుడు అడిగితే వ్యాసుడు తన శిష్యుడయిన వైశంపాయనుని భారతం చెప్పమని ఆదేశించాడు.

సంగ్రహంగా భారత కథ ఇది. పాండురాజు తన నీతి విక్రమాలతో దిగ్విజయం చేసినా మృగయాశీలుడై ఉండేవాడు. అతడొకనాడు రతిసమయంలో ఉన్న మృగమిథునాన్ని కొట్టి శాపం పొందాడు. అప్పటి నుండి అరణ్యాల్లో ఉన్నాడు. అక్కడ ఉండగానే, యమానిల శక్రాశ్వినుల అనుగ్రహంతో అయిదుగురు పుత్రులను కన్నాడు. తరువాత మాద్రితో సంగమించి చనిపోయాడు. మాద్రి సహగమనం చేసింది. ఋషులు కుంతిని, పాండవులను హస్తినాపురానికి తీసుకువచ్చి అప్పజెప్పారు. పాండవులు పెరిగి వివిధ ధనుర్విద్యలలో ప్రవీణులై ద్రౌపదిని వివాహం చేసుకొన్నారు. తరువాత ధర్మరాజు రాజసూయం చేసాడు. సమృద్ధమైన పాండవుల సంపదను చూసి దుర్యోధనుడు ఓర్వలేకపోయాడు. పాండవులచే జూదమాడించాడు. అందులో పాండవులు ఓడిపోయి అరణ్యవాస, అజ్ఞాతవాసాలు చేసారు. అయినా కౌరవులు వారిరాజ్యం వారికీయలేదు. యుద్ధం చేశారు. అందులో కౌరవపక్షం క్షీణించిపోయింది. ధృతరాష్ట్రుడు కొద్దిగా ఆత్మవిచారానికి లోనయ్యాడు. సంజయునితో తనగోడునంతా వెళ్లబోసుకొన్నాడు. (దీన్ని యదాశ్రౌష పర్వం అని కూడ అంటారు) యదాశ్రౌషం అని మొదలయి శ్లోకాలు(సుమారు 70 శ్లోకాలు) తదా నాశంసే విజయాయ సంజయ- అని అంతమవుతాయి.

అపుడు సంజయుడు ధృతరాష్ట్రుని నిర్వేదం తీర్చటానికి ముందు

వెళ్లిపోయిన 24 మంది రాజులు ధర్మశీలులయినా చనిపోయారని చెపుతాడు. అలాగే ఇంకా కొంతమందిని చెప్పివారంతా ధనధాన్యాలన్నీ విడిచి స్వర్గంచేరారని ఇది కాలప్రాప్తమనీ ఓదారుస్తాడు. దైవం చేసినదాన్ని మానవుడు నివారించలేడని ఊరడిస్తాడు.

మునులు ఈ అధ్యాయాన్ని, భారతాన్ని ప్రతిబింబంలా మనసులో ధ్యానిస్తారని వ్యాసుడు ఫలితాన్ని చెప్పాడు. ఇతిహాసాలలో ఇది శ్రేష్ఠమని వివరిస్తాడు. ఇది
పితృకార్యాలలో బ్రాహ్మణభోజన సమయంలో వినిపించాలని కూడ సూచించాడు.

పూర్వం దేవతలు నాల్గువేదాలనూ ఒకవైపున త్రాసులో వేసి తూస్తే మహత్త్వమూ భారవత్త్వమూ కలిగిన భారతం వైపుమొగ్గుచూపిందనీ, అందుకే మహాభారతం అని పేరు వచ్చిందనీ మహాభారతపదం యొక్క నిరుక్తి చెప్పాడు.

**2. పర్వసంగ్రహపర్వము** - (1) 396

ఇందులో శమంతపంచకం, అక్షౌహిణుల గురించి చెప్పి ప్రతిపర్వంలోనూ ఉన్న విషయసూచిక చెప్పాడు.

త్రేతాద్వాపరయుగాల సంధికాలంలో పరశురాముడు తనకుఠారంతో శత్రురాజులందరినీ ఇరవైఒక్కమారులు చంపివేసాడు. వారిరక్తం అయిదు మడుగులు కట్టింది. ఆరక్తంతో పితృతర్పణం చేసాడు. అప్పటికి పరశురాముని కోపం శమించింది. అందుకే ఆమడుగుల సమీపప్రదేశం శమంతపంచకం అయింది.

అక్షౌహిణి అంటే 21870 రథాలూ, అన్ని ఏనుగులూ, 65610 గుఱ్ఱాలూ, 109350 కాల్బలమూ కలిగిన సేనను అక్షౌహిణి అంటారు. కురుపాండవసేనలు కురుక్షేత్రంలో 18 అక్షౌహిణులతో పోరాడి అందరూ ఆ శమంతపంచకంలోనే చనిపోయారు. కురుపాండవయుద్ధం 18 రోజులు జరిగింది. పాండవపక్షంలో 18 రోజులూ ధృష్టద్యుమ్నుడు సేనాధిపతి. కౌరవపక్షంలో 10 రోజులు భీష్ముడు, 5 రోజులు ద్రోణుడు, కర్ణుడు రెండురోజులు, శల్యుడు సగంరోజు సైన్యాధిపతులుగా ఉన్నారు. మిగిలిన సగంరోజులో భీమదుర్యోధనులకు గదాయుద్ధం జరిగింది. అదేరోజు రాత్రి

అశ్వత్థామ మిగిలిన పాండవసైన్యాన్ని, ఉపపాండవులను, ధృష్టద్యుమ్నశిఖండులను చంపివేసాడు.

ఈ విశేషాలన్నీ 18 పర్వాలలో 100 ఉపపర్వాలలో చెప్పబడ్డాయి.

భారతానికి హరివంశం శేషగ్రంథంగా పూరణగ్రంథంగా చెపుతారు. హరివంశం ఖిలపురాణంగా కూడా చెపుతారు. దానితో కలుపుకొని నూరు ఉపపర్వాలుగా లెక్కిస్తారు.

వేదాలన్నీ సాంగంగా చదివినా కూడా భారతం చదవకపోతే వానిని విచక్షణుడుగా పరిగణించరు. ఈ కథ విన్నాక మరోకథ వినాలని ఎవరికీ అనిపించదు. కథారచయితలకు కూడా ఈ కథ ఎంతో ఆశ్రయం ఇస్తుంది. భారతం చదివినవానికి పుష్కరజలాభిషేచనంతో పనిలేదు.

వేదవిప్రునకు కనకశృంగాలుకల వందగోవులు దానంచేసినంత పుణ్యం నిత్యమూ భారతకథను విన్నవానికి కలుగుతుంది.

**3. పౌష్యపర్వము** - (1) 188

ఈ పర్వంలో గురుశుశ్రూషను గురించి ప్రధానంగా చెప్పబడింది. `గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ' అనే పరంపరాయాతమైన ఉదాత్త భారతీయభావనను గురించి చెప్పబడింది. అందులో మరోవిశేషం. ఈ కథలో భారతకథకు మూలబీజమయిన సర్పయాగకారణం కూడా ఒకటి చెప్పబడింది.

జనమేజయుడు చేసే దీర్ఘసత్రయాగం దగ్గరకు ఒక దేవశుని సారమేయం వచ్చింది. దాన్ని జనమేజయుని తమ్ములు కొట్టి తరిమివేశారు. అది వెళ్లి తల్లితో చెప్పింది. తల్లి సరమ వచ్చి జనమేజయునితో అనపరాధి అయిన నాపుత్రుని మీ తమ్ములు కొట్టారు. అందుచేత "అదృష్టమయిన భయాలు మీకు కలుగుతాయి" అని శపించింది జనమేజయుని. (భారతంలో మొదటిశాపం ఇది) తనపాపం ప్రక్షాళనం చేసుకోవాలని జనమేజయుడు సోమశ్రవుని పురోహితునిగా చేసికొని యజ్ఞం కొనసాగిస్తున్నాడు.

ఆ రోజుల్లో అయోదధౌమ్యుడనే మహర్షికి ఉపమన్యువు, ఆరుణి, వేదుడు అని ముగ్గురు శిష్యులు ఉండేవారు. వారిని గురువు కఠిన నియమాలతో పరీక్షించేవాడు. ఆ పరీక్షలో దీక్ష కలవానిని

అనుగ్రహించేవాడు. ఆరుణిని పొలం కంత కట్టమని పరీక్షపెట్టి అందులో అతని దీక్షకు సంతసించి గురువు అనుగ్రహించాడు. ఉపమన్యువును గోవులు కాయుమని చెప్పి, దానికి భిక్షాచరణాదులు నియమాలు పెట్టి, ఆ నియమాచరణంలో అతడు కనులు పోగొట్టుకొంటే అశ్వినీదేవతలస్తోత్రం చేయించి అతనిని కృతార్థునిచేసాడు. (వేదోపబృంహణం దృష్టిలోపెట్టుకొని వ్యాసభగవానుడు ఇటువంటి స్తోత్రాలను భారతంలో చాలా చెప్పాడు) వేదుడు కూడ చాలాకాలం గురుకులక్లిష్టత ననుభవించి గుర్వనుగ్రహాన్ని పొందాడు. తాను పొందిన క్లిష్టత తనశిష్యులు పడకూడదని వేదుడు భావించేవాడు. అతనికి శిష్యుడు ఉత్తం(దం)కుడు. అతడు చాలా ధార్మికంగా ప్రవర్తించి గుర్వనుగ్రహాన్ని పొందాడు. చదువు అయిన తరువాత గురుదక్షిణ ఇస్తానని ఉత్తంకుడు గురువుగారిని బలవంతపెట్టాడు. అతడు తనకేమీ అక్కర్లేదని, తనభార్యని అడగమని ఉదంకుని పంపించాడు. ఆమె తనకు పౌష్యమహాదేవి
కుండలాలు కావలెనని, నాల్గవరోజున పుణ్యకవ్రతము చేసి వాటిని ధరిస్తానని చెప్పింది. పౌష్యమహారాజును కుండలాలు అర్థించటానికి ఉదంకుడు బయలుదేరి మధ్యలో ఒక మహాపురుషుని సలహాతో అతడెక్కిన వృషభము యొక్క గోమయం భక్షించి తొందరలో నిలుచుండియే ఆచమనము చేసి వెళ్ళి రాజును చూసాడు. రాజు ఉదంకుని పాత్రతకు సంతోషించి పౌష్యమహాదేవికడకు పంపించాడు. కానీ, ఉదంకునికి పౌష్యమహాదేవి కనిపించలేదు. ఉదంకుడు తిరిగివచ్చి రాజును కలిసినాడు. రాజు "ఆమె అశుచులకు కనిపించదు" అని చెప్పగా ఉదంకుడు శుచియై (ఉదంకునకు నిలుచుండి ఆచమనము చేయుటవలన అశుచి అయినాడు) వెళ్ళి పౌష్యమహాదేవిని దర్శించి కుండలములను తీసుకువెళ్ళాడు. కుండలములు ఇస్తూ పౌష్యనిరాణి "వీనిని తక్షకుడు అపహరించవలెనని చూస్తున్నాడు" జాగ్రత్తగా తీసుకువెళ్ళమని సూచించింది. `సరే'నని ఉదంకుడు మరలా రాజును కలిసాడు. యోగ్యుడు దొరికినాడని రాజు ఉదంకుని భోజనానికి ఆహ్వానించాడు. భోజనం చేస్తున్న ఉదంకునికి అన్నంలో కేశం వచ్చింది. కేశదుష్టమైన అన్నము పెట్టినాడని ఉదంకుడు రాజును శపించాడు. రాజుకూడా ఉదంకుని "అల్పదోషమునకే నన్ను శపించావు కావున నీవు అనపత్యుడ వగుదు"వని

ప్రతిశాపమిచ్చాడు. ఇద్దరు ఒకరికొకరు శాపమునుపసంహరించమని వేడుకొన్నారు. అపుడు రాజు "నేను క్షత్రియుడను, నాకా శక్తిలేదు. నీవే నా శాపాన్ని ఉపసంహరించుము అని తన శాపమును ఉపసంహరింపజేసుకున్నాడు. ఆ తరువాత ఉదంకుడు త్రోవలో ఒకచోట కుండలములు తక్షకుని చేత పోగొట్టుకొనటం, తక్షకుని వెంటబడి ఉదంకుడు నాగలోకమునకు వెళ్లటం, అక్కడ తక్షకుని వశపరచుకొని కుండలములను పొందటం, తిరిగి ఒక మహాపురుషుని సహాయంతో నాగలోకం నుండి వెంటనే బయటకు రావటం, సమయానికి గురుపత్నికి కుండలాలు అందించటం జరిగింది.

ధర్మాచరణ తత్పరుడైన ఉదంకునికి ఈ అనుభవం తక్షకునిపై క్రోధాన్ని పెంచినది. అతడు జనమేజయుని వద్దకు వెళ్ళి సర్పయాగం చేయమని ప్రోత్సహించాడు. ఉదంకోపాఖ్యానమునకు ప్రధాన ప్రయోజనము ఈ సర్పయాగ ప్రచోదనమే(ప్రేరణ).

**4. పౌలోమ పర్వము -** (9) 4-12 (172)

ఈ పౌలోమపర్వము సర్పయాగనిమిత్తమునుగురించి, సర్పముల సంహరణప్రక్రియల గురించి తెలుపును. ఇందులో చ్యవనుని, రురుని కథలు ప్రాధాన్యం వహిస్తాయి. చ్యవనుని కథ చెప్పుతూ అగ్నికి సర్వభక్షకత్వము ఎట్లు కలిగిందో వివరించాడు. రురు, ప్రమద్వరల వృత్తాంతములో అహింసా విధానం సూచించాడు. సూక్తిరత్నములకు నిధియైన భారతమున "అహింసా పరమో ధర్మః" అనునది మొట్టమొదట చెప్పబడిన ధర్మము. విప్రునకు ఉండవలసిన లక్షణములలో మొట్టమొదటిది అహింస. తరువాతనే సత్యము, క్షమ మొదలయినవి. వేదములలో కూడా ఇదే చెప్పబడిందని వ్యాసమహర్షి ఈ కథ ద్వారా తెలియజేశాడు.

**5. ఆస్తీకపర్వము -** (46) 13-58 (1108)

జనమేజయుని సర్పయాగమును గురించి ఆ యాగము మధ్యలో ఆగిపోయిన తీరును గురించి శౌనకుడు ఉగ్రశ్రవసుని అడిగితే అపుడతడు

సర్పయాగమునకు కారణములైన అమృతమంథనము; కద్రువ, వినతల చరిత్ర, పరీక్షిత్తు చరిత్ర చెప్పి విరమణమునకు సంబంధించి ఆస్తీకుని చరిత్ర చెప్పాడు. ఈకథల సమాహారమే ఆస్తీకపర్వము.

జనమేజయుడు సర్పయాగము చేయటానికి ప్రధానకారణము తన తండ్రియైన పరీక్షిత్తును ఒక పాము కరిచి చంపటం. ఈ విషయాన్ని చెప్పి మంత్రులు, ఉదంకుడు జనమేజయుని సర్పయాగానికి ప్రోత్సహించారు. అందు ముఖ్యమైనది నాగుల తల్లియైన కద్రువ శాపము. ఆ సర్పయాగం ఆపటానికి చేసిన ప్రయత్నముల సారాంశమే ఆస్తీకుని చరిత్ర.

జనమేజయుని తండ్రి పరీక్షిత్తు. అతడు ధార్మికుడైన మహారాజు. తన ముత్తాతయైన పాండురాజువలె వేటమీద ఆసక్తి కలిగినవాడు. ఒకనాడతడు వేటకు వెళ్ళి పిపాసాతురుడై ఒక మహర్షి ఆశ్రమానికి వెళ్లాడు. త్రాగుటకు మంచినీళ్ళు కావాలని అడిగినా ఆ మహర్షి స్పందించలేదు. పిపాసాతురుడైన మహారాజు తన ప్రవర్తనకు తగని ఒక చిలిపిపని చేసినాడు. ప్రక్కనే పడి ఉన్న ఒకమృతసర్పమును వింటికొప్పుతో తీసి మునిమెడలో వేసి వెళ్లాడు. ఈ దృశ్యం చూసి తరువాత అక్కడకు వచ్చిన ఆ మహర్షి కుమారుడు కోపంతో "నా తండ్రి మెడలో ఈ పామును వేసినవాడు ఏడురోజులలో తక్షకుని విషాగ్నిచేత దగ్ధమైపోవు"నని శపించినాడు. కొంతసేపటికి సమాధినుండి
వెలుపలకు వచ్చిన శమీకమహర్షికి కొడుకు శృంగి జరిగిన విషయమంతా వివరించాడు. ఆపని చేసినది ఎవరో తెలుసుకున్నాడు. కోపము తెచ్చిపెట్టే అనర్థము, క్షమాగుణము లేకపోవుటచే కలిగిన కష్టమును శమీకుడు శృంగికి బోధించినాడు. (ఇటువంటి బోధలే భారతమునందలి ధర్మదృష్టికి ఆయువుపట్టులు) శాపం ఉపసంహరింపుమని కొడుకుతో చెప్పినాడు. కానీ అతను వినలేదు. ఒక శిష్యునితో రాజుకు కబురు చేసినాడు. రాజు తక్షకునినుండి రక్షణకు తగిన ఏర్పాట్లు చేసికొన్నాడు.

నాగులకు తల్లి కద్రువ - ఆమె సవతి వినత- వీరిద్దరూ కశ్యపుని భార్యలు- పాలసముద్రంనుండి పుట్టిన ఉచ్చైశ్శ్రవాన్ని చూచి వారిద్దరూ పందెము వేసుకొన్నారు. పందెములో తాను నెగ్గుటకు కద్రువ తన కొడుకులను ఒక ఆకార్యము చేయుడని ప్రోత్సహించినది. కొంతమందికొడుకులు ఒప్పుకొనలేదు. మరి కొంతమంది తప్పక ఒప్పుకొనిరి. ఆ పందెములో ఓడిపోయి వినత కద్రువకు దాసి అయింది.

తనమాట వినని కొడుకులను కద్రువ "జనమేజయుని సర్పయాగములో పడి నశించుడని" శపించింది. తరువాత కద్రువకు వినత దాసీత్వము చేస్తూ అరుణుని, గరుడుని కన్నది. తల్లి దాస్యము పోగొట్టుటకై గురుడుడు ఉద్యమించినాడు. కశ్యపుని ఆశీస్సులతో గజకచ్ఛపములను తిని బలిష్ఠుడై ఇంద్రుని అమరావతి చేరి గరుడుడు అమృతమును తెచ్చి సర్పములకిచ్చి తన తల్లి దాస్యము తీర్చుకొని వెళ్ళిపోయాడు.

ఇది ఇట్లుండగా తల్లిశాపమునుండి బయటపడుటకై నాగులు ప్రయత్నించారు. ఏలాపుత్రుడను నాగుని మాటల వలన వాసుకి తన చెల్లెలు జరత్కారువును జరత్కారుమహర్షికిచ్చి వివాహమొనర్చినాడు. వారిపుత్రుడు ఆస్తీకుడు. అతడు వచ్చి సర్పయాగమును మాన్పించినాడు.

ఇక పరీక్షిత్తు తనప్రయత్నములలో ఉండగా కశ్యపుడనే విప్రుడు పరీక్షిత్తును తక్షకుని విషమునుండి కాపాడటానికి వస్తూ ఉండగా తక్షకుడు ధనం ఎరచూపాడు. అతడు కూడ దైవనియోగ మట్లున్నదని తెలిసికొని ధనముగ్రహించి వెనకకు మరలిపోయాడు. శృంగిశాపము నిచ్చిన ఏడవరోజున తక్షకుని విషాగ్నితో పరీక్షత్తు దగ్ధమయినాడు.

ఈ విషయమునంతా తెలిసి జనమేజయుడు సర్పయాగం చేసాడు. ఆస్తీకుని స్తుతిచేత సర్పయాగం ఆగిపోయింది.

ఇది ఆస్తీకపర్వం. శ్రీమహాభారత ప్రవచనానికి ఆద్యస్థానం జనమేజయుని యాగం. అందుచే ఇది అంతా చెప్పవలసి వచ్చింది.

**6) అంశావతరణ పర్వము -** (6) (59-64) 326

ఈ పర్వంలో ముందు భారత కథ ఉపక్రమం చెప్పబడింది. (1) తరువాత భారతమహత్త్వం చెప్పాడు వైశంపాయనుడు. దీనిలోనే వ్యాసుడు అద్భుతమైన ఈ ఆఖ్యానాన్ని మూడు సంవత్సరాలు చెప్పాడనీ, ధర్మార్థకామమోక్షాల విషయంలో "ఇందులో ఉన్నదే మరెక్కడయినా కనిపిస్తుందనీ, ఇందులో లేనిది మరెక్కడా ఉండదనీ" చెప్పాడు.

**ధర్మేచార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ ।**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్ ॥**

తరువాత తన పుట్టుకకు కారణమయిన చరిత్ర చెపుతూ ఉపరిచర

వసుమహారాజు వృత్తాంతం చెప్పాడు. తరువాత దేవదానవుల అంశాలతో ఎవరు ఎవరు ఏ ఏ పేర్లతో ఏయే స్వభావాలతో ఉద్భవించాలో వివరించాడు. జనమేజయుడు సర్పయాగం ఉపసంహరించి ఒకనాడు వ్యాసుని భారత యుద్ధం ఎందుకు జరిగింది అని అడిగాడు. వ్యాసుడు వైశంపాయనుణ్ణి చెప్పమన్నాడు. పాండవులకూ కౌరవులకూ వైరానికి కారణం చెప్పి కథ అంతా సంగ్రహంగా చెప్పాడు వైశంపాయనుడు. ఇది అంశావతరణ పర్వము.

**7) సంభవపర్వము** - 75 (65-139) 3232

ఇందులో వేదవ్యాసుని జన్మప్రకారం చెప్పాడు. పరాశరునికి, మత్స్యగంధి సత్యవతికి కృష్ణద్వీపంలో పుట్టినవాడు కృష్ణద్వైపాయనుడు అని చెప్పాడు. తరువాత కురువంశం గూర్చి చెపుతూ నహుషుని కొడుకు యయాతికథ చెప్పాడు. యయాతికి ఇద్దరు భార్యలు. ఒకతె దేవయాని. ఈమె శుక్రుని కూతురు. ఈమెకు యదు, తుర్వసులనెడి కొడుకులు. రెండవది శర్మిష్ఠ. ఈమెకు ద్రుహుడు, అనుడు, పూరుడు అను ముగ్గురు కొడుకులు. యయాతికి శుక్రశాపం చేత కలిగిన తన ముసలితనం తీసుకొని యౌవనం ఇమ్మని కొడుకుల్ని అర్థించాడు. పెద్దవాళ్ళు నలుగురూ తిరస్కరించారు. చివరి పూరుడు సమ్మతించి, తన తండ్రికి యౌవనమును ఇచ్చాడు. యయాతి విషయవాంఛలు తీరాక తన ముసలితనం తాను తీసుకొని పూరుడికి యౌవనమూ రాజ్యమూ ఇచ్చి తపోవనానికి వెళ్ళిపోయాడు. ఎన్నోయేండ్లుఘోర
తపస్సు చేశాడు. బ్రహ్మలోకం వెళ్లి అక్కడ నుండి దేవలోకం వచ్చాడు. అక్కడ ఇంద్రుడు "నీవు నీ కొడుక్కి పట్టాభిషేక సమయములో ఏ ధర్మాలు చెప్పావు" అని అడిగాడు. యయాతి చెప్పాడు. అప్పుడు ఇంద్రుడు "నీ తపస్సు చాలా గొప్పది" అన్నాడు. "నిజమే నా తపస్సుతో మహర్షుల తపస్సుకూడ సమానం కా"దన్నాడు యయాతి. "నీ గర్వానికి పుణ్యం సమాప్తం అయింది. భూలోకానికి వెళ్ళు" అన్నాడు ఇంద్రుడు. "మనుష్యలోకానికి వెళ్ళలేను సద్భువనంలో ఉండునట్లనుగ్రహించు"మన్నాడు యయాతి. 'సరే' అన్నాడు ఇంద్రుడు.

అక్కడ యయాతి దౌహిత్రులయిన అష్టకాదులను చూసాడు. వారడిగిన ధర్మ సందేహాలన్నీ తీర్చాడు. వారి సాంగత్యంతో మళ్ళీ ఊర్ధ్వలోకానికి వెళ్ళాడు.

యయాతి చివరి కొడుకు పూరుడు వంశకర్త అయ్యాడు. కావున తరువాతి వంశాన్ని పూరు వంశం అన్నారు. తర్వాత వాని వంశంలో నిలినుడికి దుష్యంతుడు పుట్టాడు. ఆ దుష్యంతుడు ఒకసారి వేటకోసం అడవికి కణ్వాశ్రమానికి వెళ్ళి అక్కడ పెరుగుతున్న మేనకా విశ్వామిత్రుల కూతురు శకుంతలను గాంధర్వవివాహం చేసుకొని రాజధానికి వచ్చాడు.కొన్నాళ్ళకు శకుంతల భరతుని కన్నది. అతనికి యౌవరాజ్యాభిషేక వయస్సు వచ్చినా దుష్యంతుడు తీసుకువెళ్ల లేదు శకుంతలను. ఆమె తన కొడుకుని తీసుకుని దుష్యంతుని సభలోకి వచ్చింది నేరుగా. తన్నుగూర్చిచెప్పుకొన్నది. "నీవెవరో నాకు తెలియ"దన్నాడు దుష్యంతుడు. ఆమె కొన్ని నీతులు చెప్పింది. అయినా కాదన్నాడు. చివరకు విసిగి కన్నీటితో వెనుతిరిగింది శకుంతల. అంతలో ఆకాశవాణి యథార్థం చెప్పింది. అప్పుడు స్వీకరించాడు శకుంతలను దుష్యంతుడు. లోకులు అపవాదు వేస్తారని, యింతకు ముందు తెలిసినా స్వీకరించలేదని ప్రజలకు చెప్పాడు. శకుంతలా దుష్యంతుల కుమారుడే భరతుడు. అతని పేరిట ఆ వంశం భరతవంశంగా ప్రసిద్ధి వహించింది. ఆ తరువాత వాని వంశంలో 'హస్తి' పుట్టాడు. అతని పేరుమీద హస్తిపురం ఏర్పడింది. తరువాత కొంతకాలానికి కురుడు పుట్టాడు. అతని పేరుమీద కురుక్షేత్రం ఏర్పడింది. అతని పేరుతోనే కురువంశం ఏర్పడింది. ఆ వంశంలో ప్రతీపుడికి దేవాపి, శంతనుడు, బాహ్లికుడు పుట్టారు. అందులో దేవాపి చిన్నతనంలోనే తపోవనానికి వెళ్ళాడు. శంతనుడు రాజయ్యాడు. అతని భార్య గంగాదేవి తనకు పుట్టిన కొడుకుల్ని గంగలో పారవేస్తూ వుండేది. ఎనిమిదవ కొడుకును పారవేస్తుంటే శంతనుడు వారించాడు. (తమ నియమాన్ని అనుసరించి) తనకు అప్రియం పలికినందుకుగాను గంగాదేవి శంతనుని విడచివెళ్ళిపోయింది కొడుకుని తీసుకొని. కొంత కాలానికి అతణ్ణి సకల

శాస్త్రవిదుణ్ణి చేసి తీసుకు వచ్చి అప్పజెప్పింది తండ్రికి. అతడే భీష్ముడు. ఒక రోజున యమునా తీరంలో శంతనుడు సత్యవతిని అతనికి కావలసిన రెండు ప్రతిజ్ఞలుచేసి (1. తనకు రాజ్యం లేకుండా సత్యవతి కొడుకులే

రాజ్యం ఏలుతారని, 2. తాను వివాహం చేసుకోనని) తండ్రికి వివాహం చేశాడు. ఆ సత్యవతి శంతనులకు చిత్రాంగదుడు, విచిత్ర వీర్యుడూ పుట్టారు. చిత్రాంగదుడు చిన్నతనంలోనే చిత్రాంగదుడనే గంధర్వుని చేతిలో చచ్చిపోయాడు. తరువాత విచిత్రవీర్యుడికి కాశీరాజు కూతుళ్ళు అంబిక, అంబాలికలను వివాహం చేశాడు భీష్ముడు. వారియందు సంతానం పొందకుండానే మరణించాడు విచిత్రవీర్యుడు. రాజ్యం ఆరాజకమయిపోతుందనే భయంతో భీష్ముణ్ణి వివాహం చేసుకుని సంతానం కనమంది సత్యవతి. భీష్ముడు ప్రతిజ్ఞా భంగం చేయనన్నాడు. అప్పుడు వ్యాసుణ్ణి తలంచింది. అతని వలన దేవర న్యాయంతో అంబిక యందు ధృతరాష్ట్రుడు (గ్రుడ్డివాడుగా), అంబాలికయందు పాండురాజు (పాండుశరీరంతో), దాసియందు మహా మేధావి, ధర్మవిదుడు విదురుడు పుట్టారు.

భీష్ముని పెంపకంలో ధృతరాష్ట్ర పాండురాజులు చక్కగా పెరిగారు. ధృతరాష్ట్రుడికి గాంధారినీ, పాండురాజుకు కుంతీ, మాద్రులనూ ఇచ్చి వివాహం చేశారు. పాండురాజు దిగ్విజయం చేసి ప్రజల్ని సంతోషపరిచాడు. ఒకనాడు పాండురాజు కుంతీ మాద్రులతో సహా హిమవత్పర్వతసమీపానికి వేటకు వెళ్ళాడు. అక్కడ కామమోహితమయిన మృగదంపతుల్ని కొట్టాడు. ప్రాణావశిష్టమయిన ఆ మృగం తాను 'కిందముడ'నవే మునిననీ ప్రియాసంగమం అయినప్పుడే నీవూ మరణిస్తావనీ శపించి చనిపోయింది. ఎంతో విచారించాడు పాండురాజు. శతశృంగంలోనే ముని వృత్తినవలంబించాడు. కుంతీమాద్రులు సేవిస్తున్నారు. ఒకనాడు స్వర్గానికి వెళ్ళే మునులను చూచి వారి వెనుక తానూ బయలుదేరాడు. కొంతదూరం వెళ్ళాక "అనపత్యులు స్వర్గానికి రాలేరు." అని పాండురాజును రావద్దన్నారు. అప్పుడు పుత్రులపై కోరిక కలిగింది పాండురాజుకు. కుంతీదేవి తనకు దుర్వాసుడిచ్చిన వరప్రభావాన్ని చెప్పింది. తరువాత భర్త అనుమతితో కుంతి యమధర్మరాజువల్ల ధర్మరాజును కన్నది. ఇది విని గర్భవతియైన గాంధారి, ఇంకా తనకు పుత్రుడు కలగలేదనే అసూయతో ఉదరతాడనం చేసుకుంది. ఒక పెద్ద మాంసపిండం పుట్టింది. వ్యాసుడు వచ్చి దాన్ని 101 భాగాలుగా చేసి రక్షించమన్నాడు. వానిలో మొదట దర్యోధనుడు పుట్టాడు. సరిగా అదేరోజున వాయువరంవల్ల కుంతికి భీముడు పుట్టాడు. ఆ తర్వాత

రోజుకొక్కరుగా దుశ్శాసనాదులు, చివర దుశ్శల అనే కూతురూ పుట్టారు. ఒక సంవత్సరం తర్వాత ఇంద్రప్రసాదం తో కుంతి అర్జునుణ్ణి కన్నది. వసంతం విజృంభించింది. పాండురాజు మనసిజరాగాయత్తుడయి మాద్రిని కలిశాడు. వెంటనే మరణించాడు. మాద్రి సహగమనం చేసింది. అక్కడి మునులు కుంతినీ అయిదుగురు పుత్రుల్నీ హస్తినకు చేర్చారు. వారందరినీ ఓదార్చి వ్యాసమహర్షి తన తల్లి సత్యవతినీ, అంబికా అంబాలికలనూ తపోవనానికి తీసుకువెళ్ళాడు. అక్కడ వారు ముగ్గురూ ఘోరతపస్సు చేసి శరీరం విడిచారు.

కురుకుమారులు అంతా కలిసి పెరుగుతున్నారు. భీముని బలానికి అసూయపడ్డారు దుర్యోధనాదులు. నిద్రపోతున్న భీముణ్ణి కట్టివేసి గంగలోకి త్రోయించారు. ఒకనాడు కాలసర్పాలచేత కరిపించారు. విషాన్నం పెట్టించారు. అయినా భీముడు చెక్కు చెదరలేదు. కృపాచార్యులదగ్గర అంతా కలిసి విద్య అభ్యసిస్తున్నారు.

ఇది ఇట్లా ఉండగా ద్రోణుడు తన సహాధ్యాయి అయిన ద్రుపదుడిచేత అవమానింపబడి హస్తినాపురానికి వచ్చి కురుకుమారులకు గురువయ్యాడు. విద్యాభ్యాసంలో అర్జునిని నేర్పుచూసి మురిసిపోయాడు. అర్జునిని మించిన విలుకాడు లేడనేటట్లు విద్య నేర్పుతానన్నాడు. ఈ ప్రతిజ్ఞా నిర్వహణ కోసమే ఏకలవ్యుని బొటనవ్రేలు తీసుకున్నాడు గురుదక్షిణగా. ఒకనాడు ఒకమొసలి ద్రోణుని తొడపట్టుకుంది. దాన్ని విలువిద్యానైపుణ్యంతో అర్జునుడు సంహరించాడు. దానితో ద్రోణునికి చాలా సంతోషం కలిగి ఎన్నో అస్త్రాలుపదేశించాడు అర్జునుడికి. ఈ అర్జునుడు ద్రుపదుణ్ణి గెల్చి తీసుగకు రాగలడనే ధీమా ఏర్పడింది ద్రోణుడికి.

కుమారాస్త్రవిద్యాప్రదర్శనం ఏర్పాటు చేశాడు ద్రోణుడు. కురుకుమారులంతా తమతమ విద్యల్ని ప్రదర్శిస్తున్నారు. అర్జునుడు ప్రదర్శించిన విద్యల్ని ప్రశంసించాడు ద్రోణుడు. తానూ ఆ విద్యలు ప్రదర్శిస్తానని కర్ణుడు ముందుకు వచ్చాడు. నీవు రాజకుమారుడవా అనే ప్రశ్న ఉత్పన్నం అయింది. వెంటనే దుర్యోధనుడు కర్ణుణ్ణి అంగరాజ్యాభిషిక్తుణ్ణి చేసి కర్ణుని గౌరవం కాపాడాడు. తర్వాత గురుదక్షిణగా అర్జునుడు ద్రుపదుణ్ణి కట్టితెచ్చి ద్రోణుని ముందు పెట్టాడు. ద్రోణుడు ద్రుపదుణ్ణి పరాభవించాడు. అర్జునునికి ద్రోణుడు

బ్రహ్మశిరోనామకాస్త్రం ఇచ్చాడు. తర్వాత ధృతరాష్ట్రుడు ధర్మరాజును యౌవరాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు. ఇది సహింపలేక దుర్యోధనుడు శకునితోనూ, అతని మంత్రి కణికునితోనూ ఆలోచించాడు. కణికుడు దుర్యోధనునికనుకూలంగా ఎన్నోనీతులు చెప్పాడు. దుర్యోధనుడు తన దుఃఖాన్నీ, అసహనాన్నీ తండ్రితో చెప్పాడు. పాండవులను వారణావతం పంపమన్నాడు.
ధృతరాష్ట్రుడక్షరాలా ఆదేశించాడు పాండవుల్ని వారణావతం పంపుటకు.

**8) జతుగృహపర్వము -** (11) 140-150 (321)

ముందుగానే వారణావతంలో లక్కయిల్లు నిర్మించమని దుర్యోధనుడు పురోచనుణ్ణి పంపాడు. వారణావతానికి బయలుదేరారు పాండవులు. విదురుడు వ్యంగ్యంగా హితోపదేశం చేస్తాడు. ధర్మరాజు గ్రహిస్తాడు. కుంతితో సహా పాండవులు వారణావతం చేరారు. లక్కయింట్లో ప్రవేశించారు. విదురుడు పంపిన ఖనకుడు లక్కయింట్లోంచి సొరంగం త్రవ్వాడు. కృష్ణచతుర్దశినాడు కుంతి దేవపూజచేసి అన్నదానం చేసింది. ఒక బోయవనిత ఆరోజునవచ్చి వీరిపంచనే పడుకున్నది. పురోచనుడు అదే రోజు రాత్రి లక్కయింటికి నిప్పు పెట్టవలసి ఉంది. విషయం తెలిసింది పాండవులకు. సోదరుల్ని తల్లిని బిలంలోకి చేర్చాడు భీముడు. పురోచనుడికంటె ముందుగానే భీముడు పురోచనుడు నిద్రిస్తున్న గదికి నలువైపులా నిప్పుపెట్టి బిలంలోకి చేరాడు. బిలంనుండి ఎక్కడో అడవిలో బయటపడ్డారు పాండవులు. పాండవులంతా కుంతితో సహా దగ్ధమయిపోయారనుకున్నారు ప్రజలంతా. ఈ విషయం తెలిసి ధృతరాష్ట్రుడు ఆవు అరచినట్లు ఏడ్చాడు. వానితో విదురుడూ ఏడ్చినట్లు నటించాడు.

పాండవులక్కడ గంగానది దాటారు. అందరికి దాహం వేసింది. అందరినీ ఒక మఱ్ఱిచెట్టునీడను దింపి భీముడు దగ్గరలో ఉన్న కొలనులో తాను త్రాగి సోదరులకు ఉత్తరీయంలో తామరదొప్పల్లో నీళ్ళు తెచ్చాడు. భీముడు వచ్చేటప్పటికి అంతా అలసిపోయి నిద్రపోతున్నారు.

**9) హిడింబవధ పర్వము -** (5) 151-155 (222)

ఇంతలో అక్కడికి హిడింబ వచ్చింది. భీముణ్ణిచూచి మోహించిది. తన అన్న విషయం చెప్పింది. ఇంతలో హిడింబుడు రానే వచ్చాడు. హిడింబుణ్ణి దూరంగా తీసుకుపోయి చంపిపారేశాడు భీముడు. తర్వాత భీముడు కుంతిమాట మేరకు హిడింబను చేపట్టాడు. ఘటోత్కచుణ్ణి కన్నది హిడింబ సద్యోగర్భంలో. పాండవులు తలచినప్పుడు వస్తానని ఘటోత్కచుడు వెళ్ళిపోయాడు.

**10) బకవధ పర్వము -** (8) 156-163 (220)

పాండవులు ఏకచక్రపురం చేరారు. ఒక బ్రాహ్మణుని యింట్లో బ్రాహ్మణవేషంలో కాలక్షేపం చేస్తున్నారు. ఆ వూళ్ళో బకుడనే రాక్షసుడున్నాడు. వాడికి రోజుకు ఒక బండెడు అన్నము, రెండు దున్నపోతులూ, ఒక మనిషినీ ఆహారంగా పంపుతూ ఉంటారు ఆ వూరివాళ్ళు వంతులు వేసుకొని. ఒకరోజు వంతు పాండవులున్న యింటి బ్రాహ్మణునికి వచ్చింది. ఇంటి వారంతా గోలుగోలున విలపిస్తున్నారు. విషయం తెలిసి భీముని సంప్రదించి కుంతి బ్రాహ్మణుణ్ణి ఓదార్చి తన కొడుకును పంపుతానంది. ఆ బ్రాహ్మణుడు కాదన్నా బలవంతాన ఒప్పించింది. భీముడు వెళ్ళి బకాసురుణ్ణి సంహరించాడు. ఊరివారి బాధ మాన్పాడు. ఊరిప్రజలంతా ఎంతో సంతోషించారు.

**11) చైత్రరథ పర్వము -** (19) 164-182 (674)

ఒకరోజున పాండవులున్న విప్రుని యింటికి ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. పాంచాలదేశపురాజు ద్రుపదుణ్ణి గూర్చి చెప్పాడు. "ద్రోణునిచేత పరాభవింపబడ్డ ద్రుపదుడు ద్రోణుణ్ణి సంహరింపగల కొడుకునీ, అర్జునుణ్ణి చేపట్టగల కూతుర్ని కన్నాడు. ఆమె పేరు కృష్ణ, ఆమెకు ఇపుడు స్వయంవరం జరుగుతోంది- నేను వెడుతున్నాను" అని చెప్పాడు- కుతూహలురైన పాండవులూ బయలుదేరారు ద్రౌపదీ స్వయంవరానికి- మధ్యలో వ్యాసమహర్షి కనపడ్డాడు. ద్రౌపది పూర్వజన్మను చెప్పి, ఆమెకు అయిదుగురు భర్తలు అవుతారని, పాండవులను ద్రుపదపురానికి వెళ్ళమనీ

"శుభం భూయాత్" అనీ వెళ్ళాడు. పాండవులు గంగానదీతీరాన అంగారపర్ణుని చూచారు. అర్జునుడు అంగారపర్ణునితో యుద్ధంచేసి జయించాడు. తర్వాత అంగారపర్ణుడు అర్జునునితో స్నేహం చేశాడు. తపతీసంవరణోపాఖ్యానం చెప్పి వసిష్ఠుని మహిమ ఎటువంటిదో విశ్వామిత్రచరిత్రతో సహా చెప్పాడు. అంగారపర్ణుని సలహానుసరించి ధౌమ్యుని పురోహితుని గావించారు పాండవులు-ద్రుపదపురానికి వెళ్లే పాండవులకు మళ్ళీ కనపడ్డాడు వ్యాసుడు. జరుగబోయే శుభాన్ని సూచించి వెళ్ళాడు.

**12) స్వయంవర పర్వము -** (9) 183-191
**13) వైవాహిక పర్వము -** (7) 192-198 (457)

బ్రాహ్మణవేషంలో ద్రౌపదీస్వయంవరసభకు వెళ్ళారు పాండవులు - సభలో ధృష్టద్యుమ్నుడు మత్స్యయంత్రాన్ని కొట్టినవారికి ద్రౌపదినిచ్చి వివాహంచేస్తామని చెప్పాడు - కృష్ణుడు బ్రాహ్మణవేషంలోని పాండవులను గుర్తుపట్టాడు. రాజకుమారులు మత్స్యయంత్రాన్నికొట్టలేక భంగపడ్డారు - బ్రాహ్మణవేషంలో అర్జునుడు అవలీలగా కొట్టి ద్రౌపదిని గ్రహించాడు- ద్రౌపదిని తీసుకువచ్చి తల్లికి- భిక్షతెచ్చామని- నివేదించాడు. "అయిదుగురూ ఉపయోగించండి" అంది కుంతి. రామకృష్ణులు పాండవులను చూడవచ్చారు- పాండవులంతా ద్రుపదమందిరానికి వెళ్ళారు. "మేము అయిదుగురమూ చేసుకుంటాము కృష్ణను" అన్నాడు ధర్మరాజు. ద్రుపదునికి ధర్మసందేహం ఏర్పడింది. సమయానికి వ్యాసుడు వచ్చాడు. ద్రౌపదియెక్క పూర్వజన్మవృత్తాంతం చూపించి చెప్పి ద్రుపదుణ్ణి ఒప్పించాడు. పాండవులందరూ ద్రౌపదిని వివాహం చేసుకున్నారు.

**14) విదురాగమనరాజ్యలంభ పర్వము -** (13) 199-211 (506)

పాండవులు ద్రౌపదిని వివాహం చేసుకొని ద్రుపదపురంలో ఒక సంవత్సరం పాటు ఉవ్నారు. ఈ విషయం చారులవల్ల దుర్యోధనునికి తెలిసింది. దుర్యోధనుడు పాండవుల అభ్యుదయానికి అసూయచెందాడు.

ధృతరాష్ట్రుని దగ్గరకుచేరి కర్ణదుర్యోధనులు పాండవులకూ, పాంచాలురకూ భేదం పెట్టాలని ఆలోచించారు. ధృతరాష్ట్రుడు కూడ మనసు విప్పిచెప్పి వంతపాడాడు- అయినా భీష్మాదులతో ఆలోచించుదాం అని వాళ్ళను పిలిపించాడు - భీష్ముడు "నాకు మీరన్నా వారన్నా సమానమే" అన్నాడు -ద్రోణుడూ అంతే అన్నాడు - విదురుడు "లాక్షాగృహ దహన కళంకం" పోవాలంటే పాండవులను వెంటనే యిక్కడకు రప్పించి ఆదరించమన్నాడు. సరే అని ధృతరాష్ట్రుడు పాండవులకు అర్ధరాజ్యం ఇస్తానని అందరి ఎదుటా నిశ్చయించి విదురుణ్ణి ద్రుపదుపురానికి పంపి పాండవులను రప్పించాడు. సమయానికి అక్కడే ఉన్న కృష్ణుడు కూడ వచ్చాడు పాండవులతో హస్తినకు - అందరి ఎదుట ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు అర్ధరాజ్యం యిచ్చి అభిషిక్తుణ్ణి చేశాడు. ఖాండవ ప్రస్థానికి వెళ్ళి అక్కడ ఉండండి అని పంపించాడు పాండవులను. కృష్ణుని ఆదేశంతో అక్కడ విశ్వకర్మ యింద్రప్రస్థపురాన్ని నిర్మించాడు. ఒక శుభముహూర్తంలో పాండవులు నగరప్రవేశం చేసి సుఖంగా
పరిపాలిస్తున్నారు. ఒకనాడు నారదుడు వచ్చి సుందోపసుందుల కథచెప్పి - స్త్రీ విషయంలో ఒక నియమం పాటించాలని హితవు చెప్పాడు. అతని హితవు ప్రకారం ద్రౌపది ఒక్కొక్కరి యింట ఒక్కొక్క ఏడు ఉండేటట్లు నియమం చేసుకొన్నారు. ఆమె ఉన్న యింటికి యితరులు వెళ్ళరాదనీ అట్లా ఎవరు వెడితే వారు ఒక సంవత్సరం తీర్థసేవ చెయ్యాలనీ ప్రతిజ్ఞ పూనారు.

**15) అర్జునవనవాసపర్వము -** (6) 212-217 (179)

ఇట్లా ఉండగా ఒకసారి ఒకవిప్రుని హోమధేనువును రక్షించడంకోసం తన ధనుస్సు తీసుకునేందుకు అర్జునుడు ధర్మరాజు ఆయుధాగారాన్ని ప్రవేశించాడు. ధనుస్సు తీసుకుని విప్రుని హోమధేనువును రక్షించి తిరిగి వచ్చి అర్జునుడు సమయం తప్పినందుకు తీర్థయాత్రలకై బయలుదేరాడు. ధర్మరాజు వారించినా కాదని బలవంతాన అతని అనుమతి పొందాడు అర్జునుడు. అనుచరులతో కదిలాడు. ముందుగా గంగలో మునిగాడు. ఒక నాగకన్య అర్జునుని మోహించి నాగలోకానికి తీసుకుపోయింది. తన కోరిక తీర్చమని అర్థించింది. శరణాగత రక్షకుడు అర్జునుడు ఆమె మనోరథాన్ని

తీర్చాడు. సద్యోగర్భంలో ఇరావంతుడు పుట్టాడు. మర్నాడుదయానికి మళ్ళీ గంగలో తేలాడు అర్జునుడు. ఎన్నో యాత్రలుచేసి, మణిపూర పురానికి వెళ్ళి చిత్రాంగదను వివాహమాడాడు. బభ్రువాహనుణ్ణి కన్నాడు. చిత్రాంగద తండ్రి మలయధ్వజునికి కుమారునిగా సమర్పించాడు.

**16) సుభద్రాహరణ పర్వము -** (2) 218-219

**17) హరణాహరణ పర్వము -** (1) 220 (149)

తర్వాత ప్రభాస తీర్థానికి వెళ్ళాడు. అక్కడికి ద్వారక దగ్గర అని విని ఒకసారి కృష్ణుణ్ణి తలుచుకున్నాడు అర్జునుడు. ఎదురుగా నిలిచాడు కృష్ణుడు. యతి వేషం వేయించి రైవతక పర్వతంమీద ఉంచాడు అర్జునుణ్ణి-కృష్ణుడు. రాత్రి తాను కూడా అక్కడే ఉండి అర్జునునితో సరదాగా కాలక్షేపం చేశాడు. యాదవులంతా ఉదయమే రైవతకాద్రికి ఉత్సవానికి చేరారు. అక్కడున్న యతికి పరిచర్య చేసేందుకు సుభద్రను నియోగించాడు బలరాముడు. సుభద్ర పరిచర్య చేస్తోంది అర్జునునకు. ఒకరి నొకరు తెలుసుకున్నారు.

కృష్ణుని అనుమతితో అర్జునుడు సుభద్రను పరిగ్రహించి ఇంద్రప్రస్థపురానికి తీసుకు వచ్చాడు. అక్కడికి బలరామకృష్ణులు ఎన్నో కానుకలు పట్టుకువచ్చారు. కొన్నాళ్ళకు సుభద్రకు అభిమన్యుడు ఉద్భవించాడు. తర్వాత ద్రౌపదికి క్రమంగా అయిదుగురు ఉపపాండవులు పుట్టారు. (వారి పేర్లు: ప్రతివింధ్యుడు - శ్రుతసోముడు - శ్రుతకీర్తి - శతానీకుడు - శ్రుతసేనుడు)

**18) ఖాండవదాహపర్వము -** (6) 221-226 (239)

ఇట్లా ఉండగా ఒకవేసవిలో యమునానదీ సమీపంలో విహరిస్తున్న కృష్ణార్జునుల దగ్గరకు అగ్నిహోత్రుడు వచ్చాడు. శ్వేతకి అనే రాజర్షిచేసిన శత వార్షిక సత్రయాగంలో నిరంతరంగా పడ్డ ఆజ్యధారవల్ల తనకు అగ్నిమాంద్యం ఏర్పడిందనీ, అందుచేత దివ్యౌషధ యుక్తం అయిన ఖాండవవనాన్ని దహించాలి అని అన్నాడు అగ్ని. మీరు చేయవలసిందల్లా నేను దాన్ని దహిస్తుంటే దాన్ని యింద్రుడినుండి రక్షించాలి అన్నాడు అగ్ని.

సరే అన్నారు కృష్ణార్జునులు. అపుడే అగ్నిహోత్రుడు అర్జునుడికి గాండీవమూ, అక్షయ తూణీరమూ ఇచ్చాడు. కృష్ణునికి సుదర్శనచక్రమూ కౌమోదకి అనే గదనూ ఇచ్చాడు. కృష్ణార్జునులు ఇంద్రునికూడ జయించి అగ్నికోరిక తీర్చారు.

**19) మయదర్శన పర్వము** - (7) 227-233 (197)

కృష్ణార్జునులు దేవదానవులను ఇంద్రుని జయించి ఖాండవమును సంపూర్ణముగ దహింపజేశారు. అలా ఖాండవం అంతా అగ్నిదహించినా అందులో నుండి ఆరుగురు మాత్రం తప్పించుకొన్నారు. 1) అశ్వసేనుడు, 2) మయుడు, నలుగురు శార్ఙ్గకములు. నలుగురు మందపాలుని పుత్రులు వారి పేర్లు 1) స్తంబమిత్రుడు, 2) ద్రోణుడు, 3) జరితారి, 4) సారిసృక్కు.

ఇందులో మయుడనే రాక్షసుడు తరువాత ధర్మరాజుకు ఒక సభాభవనమును నిర్మించియిచ్చాడు.

**ఇది ఆదిపర్వ కథాంశము.**